www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 సెప్టెంబరు 2023
5
వైఎస్ఆర్

నేడు సెమినార్ : ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏపీ రైతు సంఘం కడప, అన్నమయ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 'వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆదివారం ఉదయం పది గంటలకు పాత బస్టాండ్ సిఐటియు జిల్లా కార్యాలయంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమినార్‌లో రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభం మద్దతు ధర, రైతాంగం పట్ల పాలకుల విధానాలు తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. సెమినార్‌కు ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

కడప : ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు

జమ్మలమడుగు : నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

నిరసనాగ్రహం

కడప : టిడిపి కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాస్తారోకో, ధర్నాలు
- జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులపై నిర్బంధం
- హౌస్, ముందస్తు అరెస్టులు

టిడిపి అధ్యక్షులు చంద్రబాబును అరెస్టు చేయడంపై నిరసనాగ్రహం పెల్లుబికింది. నంద్యాల జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో భాగంగా పోలీసులు అరెస్టు చేశారు. కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా టిడిపి శ్రేణులు మండలాల నుంచి నియోజకవర్గాలు, జిల్లాల వ్యాప్తంగా పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు, బైక్ ర్యాలీలు చేపట్టాయి. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులైన నిరసనలు, ధర్నాలు, బైక్‌ర్యాలీలు, రాస్తారోకోలపై నిర్బంధాన్ని ప్రయోగించడం విస్మయాన్ని కలిగించింది. జిల్లాల్లో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున చేపట్టిన నిరసనలు చేపట్టడంతో ఉదయం కొంతసేపు నెల కొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు రాకపోకలను నిలిపేశారు. ముందుజాగ్రత్తల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలను నిలిపేసింది. ఊహించని రాజకీయ పరిణామాలతో ఆర్టీసీ రాకపోకల నిలిపేయడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం గమనార్హం. తర్వాత యధాతథంగా బస్సు సర్వీసులు నడిచాయి.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎక్కడికక్కడే అరెస్టులు

కడప, అన్నమయ్య జిల్లాలో నిరసనలు చేపట్టిన టిడిపి నాయకులను ఎక్కడికక్కడే పోలీసులు అరెస్టులు చేశారు. కొందరిని ఇంటి దగ్గర, మరికొందరిని కార్యాలయాల దగ్గర, మిగిలిన వారిని ధర్నాలు, రాస్తారోకోలు, బైక్‌ర్యాలీల ప్రదేశాల్లో అరెస్టుల పర్వం కొనసాగింది. శనివారం ఉదయం ఏడు గంటలకే టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసనలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు, ధర్నాలతో వాతావరణం వేడెక్కింది. ఇందులో ప్రధానంగా కడప జిల్లా కేంద్రం లో ఎన్టీఆర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. కమలా పురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి వంటి కీలక నాయకుల్ని ముందస్తు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

నిరసనల జోరు

కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా నిరసనల జోరు మిన్నంటింది. కడప జిల్లాలో బద్వేల్‌లో యువ నాయకుడు రితేష్, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల్లోని పలు మండల కేంద్రాలు సహా పలు మండల కేంద్రాల్లో నిరసనలు మిన్నంటాయి. యర్రగుంట్ల, ముద్దనూరు, వేంపల్లి తదితర మండలాల్లో నిరసనలు, ధర్నాల పర్వం కొనసాగింది.

హౌస్ అరెస్టుల్లో నాయకులు

కడపలో అమీర్‌బాబు, పులివెందులలో బి.టెక్ రవి, మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్‌లను హౌస్‌అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ప్రసాద్‌బాబును టిడిపి కార్యాలయానికే పరిమితం చేశారు. రాజంపేట, నందలూరుల్లో మేడా విజయశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టాయి.

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నాయకులు అరెస్టు

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబును నంద్యాలలో పోలీసులు అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ఎన్టీఆర్ కూడలిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించి సిఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబును ఏదో ఒక రకంగా జైల్లో పెట్టాలన్నదే జగన్ వక్రబుద్ధి అని మండిపడ్డారు. 14 సంవత్సరాలు రాష్ట్ర ముఖ్య మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన చంద్రబాబును కుటిల రాజకీయాలతో జగన్ పోలీసులతో అరెస్టు చేయించడం ప్రజా స్వామ్యానికే సిగ్గుచేటని పేర్కొన్నారు. అరెస్టులతో అడ్డుకోవాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. చంద్రబాబుకు ప్రజలు అండగా నిలుస్తారని హెచ్చరించారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు నాయకులను అరెస్టు చేయడానికి ప్రయత్నించగా కాసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు ముకుమ్మడిగా హరి ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి , పీరయ్య , నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, యాదగిరి రాంప్రసాద్, సుధాకర్ యాదవ్‌ను అరెస్టు చేసి పోలీసు వాహనంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఒంటిమిట్టలో.. తెలు గుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండల టిడిపి నాయకులు కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో కడప చెన్నై జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. పోలీసులు రంగప్రవేశం చేసిన పలువురు టిడిపి నాయకులను అరెస్టు చేశారు. **చింతకొమ్మదిన్నె :** అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఖూనీ చేస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక ఇర్కాన్ సర్కిల్ సెంటర్‌లో శనివారం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి నరసింహారెడ్డితో సహా కార్యకర్తలను నాయకులు అరెస్టు చేసి కొద్దిసేపు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు **పోరుమామిళ్ల టౌన్ :** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుని అక్రమ పద్ధతిలో అరెస్టు చేయించడం అనైతిక చర్య అని తెలుగుదేశం పార్టీ నేతలు రంతు, యనమల సుధాకర్, భైరవప్రసాద్, సుబ్బారావు, శేట్టెంప్రతాప్, రామసుబ్బారావు, ఇమామ్ హుస్సేన్, సీతా వెంకటసుబ్బయ్య, గురివిరెడ్డి పేర్కొ న్నారు. పట్టణంలో కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు నల్ల రిబ్బన్ల తో నిరసన తెలిపారు. **వేంపల్లె:** టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు దుర్మార్గమని ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఖండించారు. టిడిపి కార్యాలయంలో ఉన్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌ను వేర్వేరుగా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో రామమునిరెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును శనివారం తెల్లవారుజామున సిబిసిఐడి పోలీసులు అరెస్టు చేసిన విధానం సరైంది కాదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అన్యాయం, దుర్మార్గమన్నారు. జగన్ రాజకీయ కక్ష సాధింపునకు ఇది పరాకాష్ట అన్నారు. **సింహాద్రిపురం :** మాజీ సిఎం చంద్రబాబు అరెస్టు దుర్మార్గమైన చర్యని పులివెందుల టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జైల్లో 16 నెలలు చిప్పకూడు తిన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతోనే చంద్రబాబును అర్ధరాత్రి అరెస్ట్ చేయించారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేయడాన్ని టిడిపి ఖండిస్తోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది ఒక చీకటి రోని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సిఎం సురేష్ నాయుడు, ముక్తియార్, నల్లబోతుల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో అల్లర్లు జరగకుండా ముందస్తుగా పోలీసులు వీరిని హౌస్ అరెస్ట్ చేశారు. వరదరాజుల రెడ్డి ఆదేశాల మేరకు గాంధీ విగ్రహం వద్ద నుండి శివాలయం సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన చేశారు. **ఖాజీపేట :** 14 ఏళ్లు ముఖ్య మంత్రిగా, 15 ఏళ్లు ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్న చంద్ర బాబును ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడం చూస్తే ఇది ప్రజాస్వామ్యమా? పోలీస్ రాజ్యమా? రౌడీ రాజ్యమా? అర్థం కావడంలేదని టిడిపి రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డిని దుంపలగట్టులో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వారు పోలీసుల కళ్లు కప్పి మండలకేంద్రమైన ఖాజీపేట గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాల వద్ద రాస్తారోకో నిర్వహించారు. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. **చాపాడు :** ప్రజాస్వామ్యాన్ని వైసిపి ఖూనీ చేస్తోందని మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా పుట్టా మైదుకూరులో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించాలని ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత చిన్నాన్నను చంపిన వారిని అయిదేళ్లయినా అరెస్టు చేయకుండా వెంట బెట్టుకుని సిఎం జగన్ తిరుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, అన్నవరం సుధాకర్‌రెడ్డి, రవీంద్ర, కొండపల్లి ఉమాకాంత్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాయబ్ రసూల్, సలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలోని టిడిపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **జమ్మలమడుగు రూరల్ :** వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునే అరెస్టు చేస్తుంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహకే అందడం లేదని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, కిరణ్ రాయల్, పొన్నతోట శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, క్లస్టరు, యూనిట్, మండల, గ్రామ, వార్డు, కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మహబూబ్ బాషా, పార్టీ పట్టణాధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బ్రాహ్మణపల్లె రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న టిడిపి కార్యాలయం నుండి నల్ల బ్యాడ్జీలు ధరించి బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ పార్టీ కార్యాలయం నుండి మున్సిపల్ ఆఫీస్, పాత ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వెంకటేశ్వర స్వామి గుడి , పూలంగళ్ల సర్కిల్, లక్ష్మీ థియేటర్, పార్నపల్లి రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డులో ఉన్న పార్టీ ఆఫీస్ వరకు కొనసాగింది. ర్యాలీలో తొండూరు మండల కన్వీనర్ శివమోహన్‌రెడ్డి, అచ్చు గుట్టు రవితేజరెడ్డి, పుచ్చా దేశాయ్‌రెడ్డి, శనివారపు భాస్కర్‌రెడ్డి ఉన్నారు. చంద్రబాబు అరెస్టుతో పులివెందులలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా పోలీసులు టిడిపికి చెందిన బ్రాహ్మణపల్లె వెంకట్రామిరెడ్డి, మహబూబ్ బాషా, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, అక్కులుగారి విజయకుమార్‌రెడ్డి, ఉమర్, తరుణ్ కుమార్‌కు నోటీసులు అందజేశారు. **ఎర్రగుంట్ల :** టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో శనివారం పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి. పార్టీ జెండాలు పట్టుకొని నాలుగు రోడ్ల కూడలిలో వైసిపి డౌన్‌డౌన్, సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు రమేష్‌రెడ్డి, సుంకర నాగేశ్వరరావు, రాజారెడ్డి, బయపు రెడ్డి, శివారెడ్డి, సంజీవరెడ్డి, సేట్, అబ్దుల్, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేష్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు. **చక్రాయపేట :** నారా చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అశోక్, చంద్ర, శంకర్‌రెడ్డి, బాలె రామాంజులరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, పరమేశ్వర, బిటిపల్లి అమర, ఆంజనేయులు, సుబ్బరామయ్య, పూర్ణ, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, భాస్కర్‌రెడ్డి, లోమడ రవీంద్రారెడ్డి, బెల్లం వెంకటరామ, రామాంజీ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : నిరసన తెలియజేస్తున్న పుత్తానరసింహారెడ్డి

చంద్రబాబును విడుదల చేయాలి : సిపిఎం

ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కోర్టు అరెస్టు వారెంట్ లేకుండా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రాబాబునాయుడును నంద్యాలలో జనాన్ని భయ ంభ్రాంతులకు గురిచేసి, తెల్లవారుజామున అరెస్టు చేయడం ముమ్మాటికి రాజకీయ కక్ష సాధింపు చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 9,768 కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత

ప్రజాశక్తి - కడప

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గీత

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సాయంత్రం 6:30 గంటల వరకు అందిన సమాచారం మేరకు 9768 కేసులు పరిష్కరించి రూ. 2,45,62,800 కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్ జి.గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేశామని, ఇందులో కడపలో 6, ప్రొద్దుటూరులో 4, రాజంపేటలో 1, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరు నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఎం.వి.ఓ.పి నంబర్: 458/2019 కేసులో రూ. 60 లక్షలు మొత్తానికి వాదులు, ప్రతివాదులు, చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారని చెప్పారు. ఈ కేసులో న్యాయవాదులుగా జి.ఎస్.మూర్తి, సంపత్ కుమార్ వ్యవహరించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన వారందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ జాతీయలోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసూన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ భార్గవి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రజా సొమ్ము కాజేసినందుకే చంద్రబాబు అరెస్టు : వైసిపి

కడప : ప్రజల సొమ్మును కాజేసినందుకే చంద్రబాబు అరెస్టు అయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కె. సురేష్ బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ బుద్ధి చెప్పాలని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో సిమెన్స్ సంస్థ పేరు వాడుకుని లేని ప్రాజెక్టును ఉన్నట్లుగా సృష్టించి పథకం ప్రకారం రూ. 371 కోట్లు చంద్రబాబు కొల్లగొట్టారన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండానే కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. జిఎస్‌టి, ఇంటలిజెన్స్, ఐటి, ఇడి, సిబి సిఐడి ఇలా ఏజెన్సీలన్నీ దర్యాప్తు చేసి ఇది స్కామ్ అని నిర్ధారించాయని చెప్పారు. దోచేసిన సొమ్మును విదేశాలకు పంపించి అక్కడ నుంచి తిరిగి దేశంలోకి వచ్చిందన్నారు. చంద్రబాబు జూన్ 2014 అధికారం చేపట్టిన రెండు నెలలకే ఈ స్కిల్ డెవలప్మెంట్ స్కాం ఊపిరి పోసుకుందన్నారు. ప్రాజెక్టు మొత్తం ఖర్చు 3,356 కోట్లని, ఇందులో ప్రభుత్వ వాటా పది శాతం అని, 90 శాతం సిమెన్స్ పెట్టుకుందని చెప్పారు. సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్పొరేటర్ రామలక్ష్మణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అరెస్టు సమర్థనీయం కాదు

కడప : ఏపీ సిఐడి పోలీసులు శనివారం తెల్లవారుజామున మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నోటీసులు ఇవ్వకుండా, ఎఫ్ఐఆర్ కాపీలో పేరు లేకుండా అరెస్టు చేయడం సమర్థనీయం కాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ అన్నారు. చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడుపై ఇలా ప్రతికార చర్యలు దిగటం రాష్ట్ర భవిష్యత్తుకు మంచి పద్ధతి కాదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణిస్తున్నాయని దాడులు దౌర్జన్యాలు అధికమవుతున్నాయని ప్రశ్నించిన ప్రతిపక్షాల గొంతును అక్రమ అరెస్టులు నిర్బంధాలతో అణిచివేయడం సిగ్గుచేటన్నారు.

రామకృష్ణారెడ్డి మృతికి ఎమ్మెల్సీ నివాళి

ప్రజాశక్తి-అట్లూరు

బద్వేల్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన వైసిపి ముఖ్య నాయకులు మాచునూరు రామకృష్ణారెడ్డి మృతిచెందాడు. శనివారం ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా మృతుడి స్వగ్రామం కామసముద్రానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైసిపి మండల నాయకులు అందూరి రామకృష్ణారెడ్డి, కరెంటు రమణారెడ్డి, మాధవరెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటసుబ్బయ్య ఉన్నారు.

ప్రతిపక్షాన్ని లేకుండా చేయడమే జగన్ లక్ష్యం

- చంద్రబాబు బయటకు వచ్చేంత వరకూ ఆందోళనలు
- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టు, జగన్‌కు పోయే కాలం దాపురించిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలన్నదే జగన్ ముఖ్య లక్ష్యమన్నారు. అక్రమార్జన కేసుల్లో 16 నెలలు జైలులో ఉన్న జగన్మోహన్ రెడ్డి, 14 సంవత్సరాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పాటుపడి మచ్చలేని చంద్రబాబును అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధిని నిర్వీర్యం చేసి, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, ప్రజల్లో అభాసుపాలైందని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో అవినీతి చేశారని, చంద్రబాబును అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు పరిధి దాటి విధులు నిర్వహిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని గ్రహించి నడుచుకోవాలని సూచించారు. చంద్రబాబు బయటికి వచ్చేంతవరకు ఆందోళనలు నిర్వహిస్తామని, జరగబోవు పరిణామాలకు జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి మాట్లాడుతూ జగన్ అహంకార, దుర్మార్గపు పాలన పరాకాష్టకు చేరిందని చెప్పారు. జగన్ నీతిమంతుడు అయ్యి ఉంటే ఆనాడే స్కిల్ డెవలప్మెంట్ లో జరిగిన అవినీతిపై నోరు ఎందుకు మెదప లేదని నిలదీశారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే అరెస్టులకు తెరలేపారని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్ని కుయుక్తులు పన్నిన, వైసిపికి ఓటమి తప్పదని హెచ్చరించారు.

తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

కడప అర్బన్ : ఉక్కాయిపల్లిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం.ఓబులేసు, నాయకులు యస్. యూసఫ్ డిమాండ్ చేశారు. శనివారం ఉక్కాయిపల్లెలో డివైఎఫ్ఐ నగర కమిటీ నేతృత్వంలో పర్యటించారు. ఈ సందర్భంగా డి.ఎం. ఓబులేసు మాట్లాడుతూ పందుల బెడద నుంచి ఉక్కాయపల్లి ప్రజలను కాపాడాలన్నారు. ముక్కాయపల్లె ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి అవుతున్న డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడంలో కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందని వారు మండిపడ్డారు. 20 ఏళ్లుగా నివాసం ఉన్న ప్రజలకు నీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. పలుమార్లు నీరు ఏ సమయంలో వస్తాయో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. పందుల సైరవిహారంతో వృద్ధులు, చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో ఇప్పటికే పార్కు కోసం పనులు చేపట్టి పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదని వారి ఆందోళన వ్యక్తం చేశారు.

క్యాంటీన్ల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - కడప

సినిమా థియేటర్లలో టిక్కెట్లు కంటే తినుబండారాలు కొనాలంటే భయమేస్తుందని, క్యాంటీన్ల దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. థియేటర్లోకి వెళ్లి ఒక కూల్‌డ్రింక్ లేదా పాప్‌కార్న్ కొనాలంటే తిరిగి టికెట్ ధర కొన్నంత ఖర్చు అవుతుందని తెలిపారు. పాప్‌కార్న్ ధర రూ.60, కూల్‌డ్రింక్ రూ. 60, ఎగ్‌పఫ్ రూ. 40 ఇలా ధరలు చూస్తే వణికి పోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. ఇదే పాప్‌కార్న్ ధర బయట రూ.10కే విక్రయిస్తున్నారని తెలిపారు. కనీసం తాగునీటి వసతి కూడా థియేటర్లో లేదని వాపోయారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమని వాపోయారు. అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సినిమా థియేటర్లను పరిశీలించి క్యాంటీన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హుమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, కార్మిక విభాగం నగర అధ్యక్షుడు ఉదయ్,నాయకులు అశోక్, సిద్ధు, పాల్గొన్నారు.

నిర్లక్ష్యం

ప్రజాదృష్టి

జిల్లా ప్రజాప్రతినిధుల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. జిల్లా పాలనావ్యవస్థలో జిల్లా పరిషత్ ఉపాంగం కీలకమైంది. ఇంతటి కీలకమైన సర్వసభ్య సమావేశంలో పాల్గొని జిల్లా ఎదుర్కొం టున్న సమస్యలను చర్చించడం తెలిసిందే. వీటి పరిష్కారానికి ఎటువంటి చర్యలో తీసుకోవాలనే అంశంపై చర్చించడం ఆనవాయితీ. ఇటువంటి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీ మొదలుకుని జిల్లాకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమెల్సీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు హాజరు కావాల్సి ఉంది. ఇందులో జిల్లా ప్రగతికి అవరోధాలుగా మారిన సమస్యలపై చర్చలు చేయాల్సి ఉంది. అనంతరం కలెక్టర్‌తో కూడిన జిల్లా పాలనా యంత్రాంగం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు సంయుక్తంగా సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇందులో రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఉంటే తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరుతూ జడ్పీ సిఇఒ అధికార యంత్రాంగం నుంచి వారం రోజులు ముందు ఆహ్వానాలు అందినప్పటికీ పలు వురు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్లు గైర్హాజరు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత జిల్లా పరిషత్ సమావేశానికి ఇటీవలే కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులైన బద్వేల్ ఎమ్మెల్యే, జమ్మలమడుగుకు చెందిన ఎమ్మెల్సీ మినహా మిగిలిన ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం విస్మయాన్ని కలిగించింది. జిల్లా ప్రగతిని కుంటుబరుస్తున్న అంశాలపై చర్చించడానికి రావాల్సిన బాధ్యత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులది. ఇటువంటి బాధ్యతాయుతమైన కర్తవ్యాల్ని నిర్వహించడంపై అంతులేని నిర్లక్ష్యం వహించడం దారుణం. వారం రోజులు ముందుగా ఆహ్వానాలు అందినప్పటికి కీలకమైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కార్పొ రేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్ల గైర్హాజరు కావడానికి తీరిక లేకపోవడం విస్మ యాన్ని కలిగించింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన జిల్లా పరిషత్ సమావేశానికి గైర్హాజరైన ప్రజాప్రతినిధులకు ఇంతకుమించిన మహత్కార్యానికి హాజరై ఉంటారనే వ్యంగ్యాస్త్రాలు వినిపించడం గమనార్హం. దీనికితోడు జిల్లాకు చెందిన ప్రతిపక్షాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు స్థానం లేకుండా పోవడం అధికార పక్షానికి ఆడిందే పాట పాడిందే పాటగా మారడం అంతులేని నిర్లక్ష్యానికి కారణమని చెప్పడంలో సందేహం లేదు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతి నిధులు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు బాధ్య తాయుతంగా హాజరు సమస్యల పరిష్కారంలో పాలుపంచుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను ఎస్‌టియు నగరశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు ఎస్‌టియు రాష్ట్రకార్యదర్శి ఎస్.ఎం.డి.ఇలియాస్‌బాష తెలిపారు. శనివారం కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కడప వివిధ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం.జరీనా బానో, ఎస్.యాస్మిన్ బేగమ్, ఎస్.నజీబుల్లా, ఎస్.సాధిక్ అలీ, మైదుకూరు మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎమ్.మునెయ్య, బద్వేలు మండలంలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న జి.థామస్‌లను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్‌టియు నాయకులు

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ భాష, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, ఖదీర్ బాష, సూర్యనారాయణరెడ్డి, మండలనాయకులు రామ్మోహన్, ఓబన్న, రాజశేఖర్, అదిల్, అఫ్జల్, సహబుద్దిన్, అహమద్ హుస్సేన్ పాల్గొన్నారు.

కడపలో ఓట్ల పరిశీలన ఎప్పుడు? : సలావుద్దీన్

కడప అర్బన్ : కడప నగరంలో చాలా మంది ఓటర్ల ఓట్లు జాబితాలో లేనట్టు తమ దృష్టికి తెలియ వచ్చిందని, నగరంలో అసలు ఓట్ల పరిశీలన జరుగుతుందా అనే అనుమానాన్ని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ వ్యక్త పర్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ మీనా జూన్‌లో విడుదల చేసిన ప్రకటనలో జులై 20 నుంచి బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటి వద్దకు ఓట్ల పరిశీలన చేస్తారని తెలిపారని గుర్తు చేశారు. జులై, ఆగస్టు పోయే సెప్టెంబర్ వచ్చిందని చెప్పారు. బిఎల్‌ఒల జాడా కానరాలేదన్నారు. ఓట్ల పరిశీలన గురించి కడపలో ఏ రాజకీయపార్టీ శ్రద్ధ వహించడం లేదన్నారు. నగరంలో దాదాపు 2.35 వేల ఓట్లు ఉన్నన్ని అందులో ముస్లిం మైనార్టీ ఓట్లు లక్ష ఉంటాయన్నారు. ఓట్ల జాబితా తీసుకుని చాలా మంది ప్రయివేట్ వ్యక్తులు తిరుగుతున్నారన్నారు. నగరంలో ముస్లిం మైనార్టీ ఓట్లు ఎక్కవగా గల్లంతైన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి స్పందించి నగరంలో బిఎల్‌ఒల పనితీరుపై దృష్టి సారించి ఓట్ల పరిశీలన చేపట్టాలని కోరారు.

కండువా వేసి ఆప్‌లోకి ఆహ్వానిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా

ఆప్ బలోపేతానికి కలిసి రావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆమ్ అద్మీ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఆ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. శనివారం వేంపల్లెకు చెందిన అహమ్మద్, తాజు, ఆశ్వీర్వాదం, ఖదీర్ అనే యువకులు ఆమ్‌అద్మీ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరిన యవకులకు జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రజా సమస్యలపై ఆమ్‌అద్మీ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పార్టీని బలోపేతం చేసేందుకు నడుం బిగించాలన్నారు. ఆయా వర్గాల యువకులు పార్టీలో చేరడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్, మం డల అధ్యక్షుడు గౌస్, సమీర్, పీరుబాషా, అబ్దుల్, రాజ్, సిరాజ్, మౌలాలి పాల్గొన్నారు.

కనిపించని ప్రకృతి వ్యవసాయం

క్షేత్ర స్థాయిలో ఆశించినమేర దక్కని ఫలితం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణలోకి తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆశించినమేర ఫలితాలు దక్కలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 31 మంది ఐసిఆర్‌పిలు ఉండాల్సి ఉండగా 23 మంది పనిచేస్తున్నారు. వీరికి గౌరవ వేతనం కింద నెలకు రూ.6 వేలు మంజూరు అవుతుంది. క్షేత్రస్థాయిలో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించడానికి ఆశించిన స్థాయిలో అవగాహన కల్పించలేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించి లాభాల వైపు మళ్ళించడానికి కృషి చేయాల్సి ఉంది. అలా జరగకుండా క్షేత్ర స్థాయిలో రికార్డులకే పరిమితమైనట్లు ఆరోపణలున్నాయి. పంటల సాగులో ఆశించే తెగుళ్ల నివారణకు క్రిమి సంహారక మందులు వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేయాల్సి ఉంది. సిబ్బందికి సైతం ఏడు నెలలుగా వేతనాలు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై పిఆర్‌పి శ్రీని వాసులును అడగ్గా క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు ఐసిఆర్‌పిలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

బాబుపై 371 అవినీతి కేసులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై రూ.371కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేసిన కేసే కాదు.. పరిశీలిస్తే ఏకంగా 371 అవినీతి కేసులే ఉన్నాయని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాధనాన్ని మోసం చేసి కాజేసిన కేసులో చంద్రబాబును న్యాయ స్థానంలో బోనెక్కించి సబ్ జైలు రిమాండ్‌కు పంపి స్తారన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు రోడ్లెక్కి ధర్నా చేయడం ఎందు కని ఆయన ప్రశ్నించారు. నేరం చేసినట్లు ప్రాథమికంగా రుజువైన పిమ్మట పరిశీలించి, విచారణ పూర్తి చేసిన పిమ్మట ప్రజాధనాన్ని కొల్లగొట్టిన నేరంలో చంద్రబాబు రింగ్ మాస్టర్ అని నిర్ధారించారన్నారు. యువతకు అవసరమైన స్కిల్ డెవెలప్‌మెంట్ కింద రూ.371కోట్లను స్వాహా చేశారన్నారు. ఇందులో 19శాతం రాష్ట్ర ప్రభుత్వం, 90శాతం సీమెన్స్, డిజిటెక్ చెల్లించేలా నియమమున్నప్పటికీ ఎక్కడా పాటించలేదన్నారు. క్యాబినెట్ ఆమోదం లేకపోయినా ప్రత్యేక అంశంగా తీసుకొని వ్యవహరించారన్నారు. ఒప్పందం ఒకలా ఉంటే జిఒ మరోలా విడుదలైందని ఎమ్మెల్యే జిఒ కాపీని ప్రదర్శించారు. బినామీ కంపెనీలు సృష్టించినారన్నారు. ఎపి ఎస్ఎస్‌డిసి నుండి రూ.371కోట్లు డిజిటెక్‌కు చెల్లించారన్నారు. చంద్రబాబు అరెస్టుకు మూడు నెలలుగా హైకోర్టులో ప్రయత్నాలు జరిగాయన్నారు. జిఎస్టీ వారికి అనుమానం వచ్చి తీగలాగితే డొంక కదిలిందన్నారు. టిడిపి ఆవిర్భావానికి కారణమైన ఎన్టీఆర్‌ను ఇబ్బందులకు గురిచేసినందుకు బాబు శేషజీవితమంతా ఇంతకింత అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. నేరం చేసిన వాడు శిక్ష అనుభవిచండం ధర్మమని రాచమల్లు అన్నారు.

జిఒ కాపీని చూపుతున్న రాచమల్లు

రక్త హీనత లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు రక్త హీనత సమస్య లేకుండా చూసుకోవాలని సిహెచ్‌సి వైద్యాధికారి జ్యోత్స్న సూచించారు. మైదుకూరు సిహెచ్‌సిలో శనివారం గర్భిణులకు పిఎంవైఎస్‌కె పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సిహెచ్‌సీలో అన్నిరకాల వసతులు ఏర్పాటు చేసిందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకుంటూ రక్తహీనత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి నెల ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన కింద మండల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం పొందాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలన్నారు. చాపాడు మండలం బద్రిపల్లి గ్రామానికి చెందిన పల్లవి షాపింగ్ మాల్ నిర్వాహకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి గుత్తి వీర కిషోర్ యాదవ్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని వైద్యసిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అమ్మా సేవా సమితి సభ్యులు శివశంకర్, సుబ్బరాయుడు, ఫోటోగ్రాఫర్ హరి, మోతే ఉపేంద్ర, సతీష్ బాబు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, గర్భవతులు, పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని డాక్టర్ హనీఫ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. గైనకాలజిస్టు సుస్మిత, శ్రీకృష్ణ హాస్పిటల్ ప్రొద్దుటూరు సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెల తప్పక పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోవాలన్నారు గర్భిణులకు సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్ యాదవ్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, స్టాఫ్ నర్స్ విజయమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధు, యంఎల్‌హెచ్‌పిలు నిర్మల, నాగలత, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఆశా కార్యకర్తలు కరుణామణి, ప్రభావతి, అనసూయ, రామక్క పాల్గొన్నారు.

కెటిఆర్‌కు స్వీయచిత్రం బహూకరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలంగాణ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయులరెడ్డి (మహేష్ ఆర్ట్స్) స్వీయచిత్రాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా చిత్రకారుడు శనివారం మాట్లాడుతూ ఏడు రోజులపాటు ప్రొద్దుటూరు నుండి సైకిల్ యాత్ర చేసి హైదరాబాద్ చేరుకొని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మంత్రి కెటిఆర్ చిత్రాన్ని బహూకరించానన్నారు. సేవ్ ది గర్ల్‌ఛైల్డ్ లోగోతో చిత్రాలను బహూకరించానన్నారు. మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ తమపై అభిమానంతో ఇంత దూరం సైకిల్ యాత్ర చేసి సామాజిక అంశాన్ని భూజానికెత్తుకొని తమ చిత్రాలను చిత్రీకరించి బహూకరించడం సంతోషకరమన్నారు. ఆడపిల్లలను చదివించడం ఎదిగినంత ఎత్తుకు ఎదగనివ్వడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో యువచిత్రకారిణి ప్రసన్న, సభ్యులు నారాయణ పాల్గొన్నారు.



చిత్రపటాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

కొనసాగుతున్న వరి సాగు

- నాట్లు వేస్తున్న బెంగాల్ వలస కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట ఈ ఏడాది నామ మాత్రంగా సాగవుతోంది. ప్రతి సంవత్సరం మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, మఠం మండలాల్లో అధికంగా రైతులు వరిసాగు చేపట్టేవారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో కెసికి నీరు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో వరిసాగు పూర్తిగా తగ్గింది. పెన్నా, కుందూ, బ్రహ్మసాగర్, బోరు బావుల పరిధిలో 15వేల ఎకరాల్లో మాత్రమే వరి పంట సాగ పూర్తయింది. వారం, పది రోజులలో 5 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత వర్షంతో వరి సాగు పెరిగే అవకాశం కనిపిస్తోంది. చాపాడు మండలంలో కుందూనది, కెసి పరిధిలో 15 వేల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా, కేవలం 4వేల ఎకరాలకు పరిమితమైంది. మైదుకూరు,ఖాజీపేట, బి మఠం దువ్వూరు మండలాల పరిధిలో తెలుగు గంగ రిజర్వాయర్ కింద 10 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. గతంతో పోలిస్తే వరి పంట సాగు తగ్గుముఖం పట్టింది. ఇంధన ఖర్చులు పెరగడంతో వరి సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. విత్తన వడ్లకు రూ.2వేలు, ట్రిల్లర్, గేజీలు కొట్టినందుకు ఎకరాకు రూ.1600 ప్రకారం 2 దఫాలు చేపట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. నాటేందుకు రూ.4,500, నారు మోసేందుకు రూ.800, కాడి ఎద్దులకు రూ.1,500లతో కలిపి రూ.15 వేల వరకు ఎకరాకు సాగు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. బెంగాల్ ప్రాంతం నుండి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. సుమారుగా 300 మందికిపైగా బెంగాలీ కూలీలు వలస వచ్చి వరినాట్లు వేస్తున్నారు. వారికి కూడా గతంలో కంటే గిరాకీ తగ్గింది. రూ.4000 ఎకరాకు కూలీలకు తీసుకుంటూ వరినాట్లు వేస్తున్నారు. ఈ నెల చివరి వారం వరకు వరి నాట్లు కొనసాగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

కేతవరం రెవెన్యూ పరిధిలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

పాపాఘ్ని నదిలో ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నదిలో ఇసుక ఆక్రమ రవాణా ఆగలేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పాపాఘ్ని నది నుండి టిప్పర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రతి రోజూ రెండు పెద్ద ఇటాసి యంత్రాలతో దాదాపు 30 టిప్పర్లుతో ఇసుక రవాణా చేస్తున్నారు. పాపాఘ్ని నది నుండి దాదాపు 23 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆ తాగునీటి బోర్లుకు సమీపంలో ఇసుకను తవ్వుతున్నారు. ఇసుక తవ్వకాలు సమాచారం మండలస్థాయి అధికారులకు తెలిసినా కూడా ఏ ఒక్కరూ స్పందించలేదనే ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరుగుతుండడంతో వేసవిలో తాగునీటి, సాగు సమస్య తలెత్తే అవకాశం ఉందని ప్రజలు, రైతులు వాపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణంగా మారిందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులపై మండి పడుతున్నారు. ఇంటి నిర్మాణ అవసరాలకు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తే అలాంటి వాటిని అధికారులు పట్టుకొని జరిమానా, కేసులు విధిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పూట కూడా భారీగా టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ఇసుక అక్రమ రవాణాపై సర్పంచు రాచినేని శ్రీనివాసులు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన పాపాఘ్ని నదిలోకి వెళ్లి టిప్పర్లను వెనక్కి పంపారు. ఇసుక తరలిస్తే తాగునీటికి ఇబ్బందులు వస్తాయని సర్పంచు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇసుకను తరలిస్తే అడ్డుకొంటామని సర్పంచు తెలిపారు. అయినా మళ్లీ టిప్పర్లు ఇసుక రవాణా చేసేందుకు పాపాఘ్ని నదిలోకి వెళ్లాయి.

రాత్రివేళ టిప్పర్లతో ఇసుక తరలింపు

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సర్పంచు రాచినేని

ఘనంగా ముగిసిన శ్రావణమాసోత్సవాలు

గండి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి శ్రావణ మాసోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. తెల్లవా రుజామున 5 గంటల నుండి ఆంజనేయస్వామి మూల విరాట్‌కు పలురకాల పూలతో ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజా స్వాములు అలంకరించారు. ముందుగా దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, దేవస్థాన చైర్మన్ పిలుప్రోలు రాఘవేంద్ర ప్రసాద్, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇందుకూరు గ్రామం చప్పిటి వెంకట్రామిరెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి, ధర్మపత్ని జయ ప్రభాదేవి, వారి బ్రదర్స్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం ప్రారంభం నుంచి నాలుగు శ్రావణ శనివారాలు అల్పాహారాన్ని చక్రాయపేట మండలం గంగారపు వానపల్లి గ్రామానికి చెందిన అరుపు చిన్నకృష్ణారెడ్డి ధర్మపత్ని రుక్మిణీదేవి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్‌కె వ్యాలీ సిఐ గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చక్రాయపేట, సురభివారు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

దేవాలయాల ఆవరణలో భారీ ఎత్తున అన్నదానం

మండల కేంద్రమైన చక్రాయపేటలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి, వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి అడ్వకేట్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాస చివరి శనివారం పునస్కరించుకొని ఇటు రాయచోటి వైపు నుండి గండి దేవస్థానానికి వచ్చే భక్తులకు, గండి దేవస్థానం నుంచి రాయచోటి వైపునకు వెళ్లే భక్తులకు చేశారు. కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్లు కర్నాటి హరినాథరెడ్డి, చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గండి దేవస్థానం మాజీ ఇఒ యోగేశ్వర్‌రెడ్డి, దేవస్థాన వైస్ చైర్మన్ నాగభూషణం, దేవస్థాన కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, ఇందుకూరు శ్రీనివాసులు, టీచర్ నరసింహులు, ఆర్‌ఎంపి రామకృష్ణ, పెంచలయ్య, ఓబులేసు పాల్గొన్నారు. **వేంపల్లె :** శ్రావణ మాసం సందర్భంగా గండికి వచ్చే భక్తుల కోసం పలు చోట్ల అన్నదాన సత్రాలను దాతలు ఏర్పాటు చేశారు. వేంపల్లెలోని గండి రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద రజిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు రాధికరెడ్డి జ్ఞాపకార్థం జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కూడా అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణుడి ఆలయం వద్ద కూడా కార్యక్రమం నిర్వహించారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచికె బాబు కోరారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిలదీస్తూ శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చికె బాబు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు జరుగు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి 9 సంవత్సరాలు గడిచిన వర్గీకరణ చేపట్టకపోవడం దారుణమన్నారు. 30 సంవత్సరాలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నా ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ పట్ల అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని, అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు సింగరయ్య, ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, జిల్లా నాయకులు సబ్బగాళ్ళ నరసింహులు, సీనియర్ నాయకులు చంద్రకుమార్, బొంతల ఓబులేసు, దస్తగిరి, చంద్ర, మహేష్ నాగరాజు, మారెన్న, మల్లాంజనేయులు, నరహరి, ఓబయ్య, ఎంఇఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల నేతలు

తగిన పత్రాల్లేకుండా వాహనాలు నడిపితే జరిమానా

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఎస్ఐ హుస్సేన్ తన సిబ్బందితో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ మేరకు వాహనాలకు సంబంధించి లైసెన్సులు లేకుండా నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. రికార్డులు లేని వాటికి కూడా జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు సంబంధించిన రికార్డులను, లైసెన్సులను తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపకూడదని ఆయన సూచించారు.

జిపిఎస్ ప్రతిపాదన ఆమోదయోగ్యం కాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిపిఎస్ స్థానంలో జిపి ఎస్ తీసుకురావాలనే ప్రభుత్వ ప్రతిపాదన ఉద్యోగులకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఎపి ఎస్‌టిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు సి.శ్రీనివాసులు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాత పద్ధతిలో పింఛను మాత్రమే సరైన పరిష్కారమన్నారు. ఉద్యోగి తమ జీతంలో చందా కట్టి పింఛన్ పొందడం అనేది బాధాకరమన్నారు. దీన్ని వెంటనే రద్దు చేసి ఒపిఎస్‌ను అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల హామీగా ఇచ్చిన సిపిఎస్ రద్దును వెంటనే ప్రకటించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి గంటా రామమోహన్, శివరామయ్య, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షులు సి.శ్రీనివాసులు

చనిపోయిన వారి పింఛన్లు స్వాహా

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని ఆయా సచివాలయాల పరిధిలో చనిపోయిన వారి పింఛన్లను వెల్ఫేర్లు స్వాహా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఫించన్లు స్వాహా విషయమై ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. గత నాలుగు సంవత్సరాలుగా ఆయా సచివాలయ పరిధిలో చనిపోయిన వారి పేర్లను తొలగించకుండా కొందరు వెల్ఫేర్లు వారి లాగిన్ ద్వారా స్వాహా చేసినట్లు సమాచారం. 3, 6 సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించారనే ప్రచారం జరుగుతోంది. ఫించన్లు డబ్బులు స్వాహా విషయం వేంపల్లెలోని వైసిపికి చెందిన పెద్ద నాయకుడి దృష్టికి పోవడంతో విచారణ చేయాలని ఆ అధినేత చెప్పడంతో అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన బదిలీల్లో సచివాలయంలో పని చేసే వెల్ఫేర్లు వేరే చోటికి బదిలీ అయినప్పటికీ వారు వారి లాగిన్ ద్వారా ఆ ఫించన్లను ఆ ప్రాంతానికే బదిలీ చేసుకొని డబ్బులు డ్రా చేసుకుంటున్నట్లు సమాచారం. 6వ సచివాలయంలో చిన్నబ్బి అనే వ్యక్తి 2021లో చనిపోయినప్పటికీ ఇప్పటి వరకు ఫించన్లు డబ్బులు డ్రా చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా.. చనిపోయిన వారి డబ్బులు స్వాహా చేసిన దానిపై ఫిర్యాదు రావడంతో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో అన్ని సచివాలయాల్లో నుండి సమాచారం తెచ్చుకొని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అవినీతి చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని ఎంపిడిఒ తెలిపారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యలేవైనా ఉంటే చెప్పండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైలవరం

సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామ శివారెడ్డి కాలనీలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి కోసం నిర్మించిన మినరల్ వాటర్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల చైర్మన్ బడిగింజల విజయలక్ష్మి, బిసి సెల్ అధ్యక్షులు రామాంజనేయులు యాదవ్, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి పులివెందులలో చీనీకాయల కొనుగోలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందులోని మార్కెట్ యార్డ్‌లో ఆదివారం నుంచి చీనీ కాయలు కొనుగోలు చేస్తున్నట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చీనీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు మంచి ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న నజీర్

రాష్ట్రంలో రాక్షస పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేస్తారని వైసిపి నాయకులు రాష్ట్రమంతా ధర్నాలు, రాస్తారోకోలు చేశారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు క్రమంలో టిడిపి నాయకులను గృహనిర్బంధాలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒక రాజకీయ పార్టీ సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటే మరో రాజకీయపార్టీ వారి జెండాలతో అక్కడికెళ్లి అడ్డుకోవడమేంటని, ఇందుకు పోలీసులు వత్తాసు పలకడమేంటని ఆయన అన్నారు. వైసిపి పోలీసులతో పాలన సాగిస్తోందన్నారు. కేరళలో మాజీ ముఖ్యమంత్రి ఉమెన్‌చాందీ మృతితో ఉప ఎన్నిక నిర్వహించిన పుతుప్పలిలో ఆయన కుమారుడు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి చాందీ ఉమెన్ 37,719 ఓట్ల మెజార్టీ విజయం సాధించారన్నారు. కొట్టాయం జిల్లాలో కాంగ్రెస్‌కు పెట్టని కోటగా ఉన్న ఈ నియోజకవర్గానికి ఉమెన్‌చాందీ 1970 నుండి మృతి చెందే వరకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారన్నారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు నజీర్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై మురుగునీరు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రమైన కొండాపురం సిఎంఆర్ కాలనీలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఈ దారిన నిత్యం జనసంచారం అధికంగా ఉంటుంది. కొండాపురం పాత బస్టాండ్ ప్రాంతవాసులు, సిఎంఆర్ కాలనీ ప్రజలు జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. ఈ రహదారి పైకి చుట్టుపక్కల నివాసగృహాల నుంచి వృథా నీరు రోడ్డుపైకి చేరుతోంది. అంతేకాక కుళాయిల నుంచి వృథా నీరు కూడా రహదారిపై పారుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ దారి మురికిగా తయారవుతోంది. విద్యార్థులు, ప్రజలు, వాహన చోదకులు వెళుతుంటారు. అయినా వారు కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. మురుగు నీటిలో పడి గాయాలపాలైనప్పటికీ ఏ అధికారి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉండే వారు తమ ఇంటి ప్రాంగణంలో మురుగునీటి గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఆ సమస్య ఉత్పన్నం కాదు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులుగానీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిఎంఆర్ కాలనీలో ఇళ్లలో నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

మహారాజ రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

O S No. 106/2022

Puduru Sivalakshumma W/o Late.Puduru Suryanarayana Reddy Hindu, aged 60 years. Residing at hig 81 Housing Board colony, Gopavaram, Proddatur Town, Kadapa (dist)

..Plaintiff

V/s

Kottapalli, Meghana Reddy W/o Late.Puduru Gowtham Prathap Reddy, Hindu, aged 34 years Residing at Flat No.203, 20/107-7 Vasantham hights Near Balireddy Hospital, co-operative colony, Kadapa.

Defendent

నోటీసు

పై దావాలో వాది అయిన పుదూరు శివలక్షుమ్మ గారు పుదూరు గౌతమ్ ప్రతాప్‌రెడ్డి గారికి తాను కూడా వారసురాలని పై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల 11-09-2023 ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the court//

ఇట్లు
వి.రామమోహన్,
కె.రామమోహన్,
బి.ఎన్.అక్బర్ అలీఖాన్
అడ్వకేట్స్, కడప.